సాక్షి నిర్మల్

గురువారం । 8 । జూన్ । 2023



చేపల కోసం క్యూ

మృగశిర కార్తెకు ఒక్కరోజు ముందే బుధవారం జిల్లా కేంద్రంలోని చేపల మార్కెట్‌లో సందడి నెలకొంది. చేపలు కొనేందుకు జనం పోటీపడగా మార్కెట్ కళకళలాడింది. 8లో▸



బాసర ఆలయంలో పూజలు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని బుధవారం భక్తులు దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0 /29.0

మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జడ్జి దేవేందర్‌బాబు

భైంసారూరల్: లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని భైంసా కోర్టు న్యాయమూర్తి దేవేందర్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఖత్‌గాం గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరు చట్టాలను గౌరవించాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. చిన్నచిన్న విషయాలపై గొడవ పడి పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడవద్దని సూచించారు. ఈనెల 10న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీకి వస్తే కేసులు పరిష్కరిస్తామని వివరించారు. సర్పంచ్ రాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘువీర్, న్యాయవాదులు మాధవి, ముత్తన్న పాల్గొన్నారు.

బీసీ రుణాలపై స్పష్టతనివ్వాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ప్రభుత్వం బీసీ కుటుంబాలకు రూ.లక్ష ఆర్థికసాయం చేస్తామని చేసిన ప్రకటనపై పూర్తి స్పష్టతనివ్వాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఏయే కులాలు అర్హులు, గతంలో స్వీకరించిన దరఖాస్తుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొంతమందికే రుణాలిచ్చి మిగతావారిని ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు.

మల్బరీ సాగు లాభదాయకం



మల్బరీ తోటను పరిశీలిస్తున్న రైతులు

కడెం: మల్బరీ సాగు రైతులకు లాభదాయకమని ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ఏఎస్వో భరత్ పేర్కొన్నారు. బుధవారం మామడ, కొరిటికల్ గ్రామాలకు చెందిన రైతులకు మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలోగల మల్బరీ సీడ్ ఫాంలో అవగాహన కల్పించారు. మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకం, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, మార్కెటింగ్ తదితర అంశాల గురించి వివరించారు. టీఏలు రాములు, బిక్యానాయక్, యశ్వంత్ తదితరులున్నారు.

బీసీలకు రాజ్యాధికారంతోనే బంగారు తెలంగాణ



సమావేశంలో మాట్లాడుతున్న నర్సాగౌడ్

కుంటాల: బీసీలకు రాజ్యాధికారంతోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ఓబీసీ మోర్చా మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో 52శాతం బీసీ కులాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అణిచివేసిందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే బీసీలకు సరైన న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తంజేశారు. ఈ సందర్భంగా 22 మందితో బీజేపీ ఓబీసీ మోర్చా, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో ఎంపీపీ ఆప్క గజ్జారాంయాదవ్, మండల కన్వీనర్ గుడ్డేటి నర్సయ్య, నాయకులు తాటి శివ, వెంకన్న, సాయిలు, ముత్తేశ్, దత్తుపటేల్, మల్లారెడ్డి, రమణారావు, సోమ సత్తయ్య, రాజ్‌కుమార్, కృష్ణ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనానికి ఆహ్వానం

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11వ తేదీన తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న కవి సమ్మేళనంలో పాల్గొనాలని జిల్లా కేంద్రానికి చెందిన కవి, రచయిత, కవియాత్ర అధ్యక్షుడు కారం శంకర్‌కు ఆహ్వానం అందింది. తెలంగాణ సాహిత్య అకాడమీ నుంచి శంకర్ ఆహ్వానం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు శంకర్‌ను అభినందించారు.

జిల్లాకు త్వరలో కేటీఆర్..!



శివాజీచౌక్‌లోని వైకుంఠధామం



మంత్రి కేటీఆర్



జిల్లాకేంద్రంలోని భాగ్యనగర్‌లో ధోబీఘాట్ నిర్మాణ స్థలం

- పలు అభివృద్ధి పనుల ప్రారంభం
- జిల్లాకేంద్రంలో సమీకృత మార్కెట్
- ఆధునిక ధోబీఘాట్ ఏర్పాటు
- పర్యాటకాభివృద్ధి పనులకూ ఛాన్స్

నిర్మల్: జిల్లాకు ఇటీవలే ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చి వెళ్లగా, త్వరలోనే మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ రానున్నారు. జిల్లాకేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం, మరికొన్నింటికి శంకుస్థాపన చేసేందుకు ఆయన రానున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ నెల 25వ తేదీన లేదా జూలై మొదటి వారంలో అమాత్యుడు రానున్నట్లు సమాచారం. ఈ నెల 4న సమీకృత కలెక్టరేట్, బీఆర్‌ఎస్ భవన్‌లతోపాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు సీఎం వచ్చిన విషయం తెలిసిందే. బహిరంగ సభలో జిల్లాకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక మంత్రి కేటీఆర్ కూడా వస్తుండటంతో ఎన్నికల ముందు జిల్లాకు మరిన్ని నిధులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ఆశిస్తున్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రోద్బలంతో నిర్మల్ మున్సిపాలిటీలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. స్థానిక శివాజీచౌక్‌లో గల శ్మశానవాటికను రూ.2.73కోట్లతో వైకుంఠధామంగా తీర్చిదిద్దుతున్నారు. జిల్లాకేంద్ర ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా 23.50ఎంఎల్‌డీ సామర్థ్యం గల మంచినీటి సరఫరా అభివృద్ధి పథకం రూపొందించారు. ఈపనులు దాదాపు పూర్తయ్యాయి. స్థానిక బంగల్‌పేట్ ఇసురాళ్లగుట్టపై పంప్‌హౌస్ నిర్మించారు. మిషన్ భగీరథ ద్వారా మాడేగాం నుంచి వచ్చే నీటిని ఇక్కడి నుంచి నిర్మల్‌లోని అన్ని ట్యాంక్‌లకు సరఫరా చేయనున్నారు. వీటితో పాటు పూర్తయిన వివిధ పనులు ప్రారంభిస్తారు.

'అర్బన్' ఏరియాలో సమీకృత మార్కెట్

రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో వెజ్-నాన్‌వెజ్ సమీకృత మార్కెట్ల ఏర్పాటు కొనసాగుతోంది. దాదాపు చాలాచోట్ల పూర్తయినప్పటికీ నిర్మల్‌లో స్థల ఎంపిక వివాదం కొనసాగడంతో ఆలస్యమైంది. ముందుగా స్థానిక బస్టాండ్ ఆవరణలోని ఖాళీ స్థలంలో నిర్మించేందుకు ప్రయత్నించగా, ఆర్టీసీ నుంచి సానుకూల స్పందన రాలేదు. తాజాగా ప్రస్తుత అర్బన్ తహసీల్దార్, ఆర్‌అండ్‌బీ కార్యాలయాలున్న స్థలాన్ని ఎంపిక చేశారు. కొత్త కలెక్టరేట్ నిర్మాణంతో జిల్లా కార్యాలయాలన్నీ అక్కడికి వెళ్లనున్నాయి. ఇందులో భాగంగా ఆర్‌అండ్‌బీ, అందులోనే ఉన్న డీఎస్‌డీవో ఆఫీస్ అక్కడికి తరలించనున్నారు. ఇక అర్బన్ తహసీల్దార్ ఆఫీస్ ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ భవనంలోకి మార్చనున్నట్లు తెలిసింది. ఈమేరకు ఆయా కార్యాలయాలున్న ప్రస్తుత ఏరియాను వెజ్-నాన్‌వెజ్ సమీకృత మార్కెట్ కోసం కేటాయించారు. ఆఫీసులు తరలించగానే భవనాలు తొలగించే పనులు చేపట్టనున్నారు.

ఆధునిక ధోబీఘాట్..

సీఎం కేసీఆర్ రజకుల కోసం ప్రకటించిన ఆధునిక ధోబీఘాట్ నిర్మాణ పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. స్థానిక భాగ్యనగర్‌లో గల వ్యవసాయశాఖ పాత గోదాముల వద్ద మోడల్ ధోబీఘాట్ కోసం స్థలం కేటాయించారు. ఆధునిక యంత్రాలతో దీనిని ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. దీంతో పాటు ఇప్పటికే నిర్మాణం పూర్తయిన నూతన ఫిష్‌మార్కెట్‌ను మంత్రి ప్రారంభించే అవకాశాలున్నాయి.

పర్యాటకాభివృద్ధికి ఛాన్స్

చారిత్రక నేపథ్యం కలిగిన నిర్మల్‌లో ఎన్నో చూడదగిన ప్రదేశాలున్నప్పటికీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. సరైన నిధులు లేక చారిత్రక కట్టడాలు, ప్రదేశాలను అభివృద్ధి చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. మంత్రి కేటీఆర్ నిర్మల్‌కు రానుండటంతో ఇక్కడి చారిత్రక, పర్యాటక అభివృద్ధికి నిధులిచ్చే అవకాశాలున్నట్లు ఆశిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా పురాతన బావులు, కట్టడాలను వెలికితీయడం, వాటి పరిరక్షణ, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేటీఆర్ శ్రద్ధ చూపుతున్నారు. ఇదేక్రమంలో జిల్లాకేంద్రంలోనూ ఇలాంటి వాటికి నిధులిచ్చే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

తెలంగాణలోనే ఇంటింటికీ తాగునీరు

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో సాగునీటి దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అల్లోల

నిర్మల్ టౌన్: మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో బుధవారం సాగునీటి దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు కళాకారులు జానపద గేయాలు ఆలపించి అలరించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్‌లో రాష్ట్రం సాధించిన ప్రగతిని వీడియో ద్వారా వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో ఎంతోమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సమస్యలు దూరం చేసి, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతును రాజుగా చేశారని పేర్కొన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో 178 చెరువుల మరమ్మతు పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. స్వర్ణ ప్రాజెక్ట్ కింద సాగు విస్తీర్ణం పెరిగిందని తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే చెరువుల పండగను జాతరలా నిర్వహించుకుందామని పేర్కొన్నారు. కాగా, వరి కొనుగోళ్ల విషయంలో ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈనెల 4న నిర్మల్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ సభకు వచ్చిన జనాలను చూసి ఓర్వలేకపోతున్నాయని పేర్కొన్నారు. అనంతరం నీటిపారుదల శాఖలో రాష్ట్రంలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచిన నిర్మల్ ఈఈ రామారావుతోపాటు పలువురు ఉద్యోగులకు మంత్రి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్, ఎస్‌ఈ సుశీల్, ఆర్డీవో స్రవంతి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, సారంగాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాజేందర్, గోనుగోప్పల నర్సయ్య, నీటిపారుదల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్ 'బడిబాట'



- 3నుంచి 12వరకు కార్యక్రమం
- కొనసాగుతున్న ర్యాలీలు
- బాల్యవిద్యపై అవగాహన
- ఐదేళ్లలోపు పిల్లల పేర్లు నమోదు
- జిల్లాలో 926 కేంద్రాలు

నిర్మల్‌చైన్‌గేట్: చిన్నారులను బడిబాట పట్టించేందుకు అంగన్‌వాడీ టీచర్లు వారి ఇళ్లబాట పట్టారు. ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరుతూ ఇంటింటా తిరుగుతున్నారు. తల్లిదండ్రుల్లో చైతన్యం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఐదేళ్లలోపు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఐదేళ్లు దాటినవారు పాఠశాలల్లో ఉండాలనే నినాదంతో పట్టణాలు, గ్రామాల్లో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈనెల 3నుంచి 12వ తేదీ వరకు బడిబాట నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించగా ఈ మేరకు కార్యక్రమం కొనసాగుతోంది.

సేవలు వివరిస్తూ...

జిల్లాలోని ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించాలని ఉన్నతాధికారులు జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ నెల 12వ తేదీ వరకు జిల్లాలోని ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ప్రదర్శనలు చేపట్టి.. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రతీ మూడేళ్ల చిన్నారి అంగన్‌వాడీ కేంద్రంలో చేరాల్సిన ఆవశ్యకత, అవసరాన్ని స్థానికులకు వివరించేలా అంగన్‌వాడీ టీచర్లను సన్నద్ధం చేశారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, స్వయం సహాయక గ్రూపులతో కలిసి బాల్యవిద్య ప్రాధాన్యం తెలిపేలా గ్రామగ్రామాన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు, పోషక పదార్థాల వివరాలు వివరిస్తున్నారు.

విజ్ఞానం కూడా అందించాలని..

గతంలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ-స్కూల్ కార్యక్రమంగా భావించేవారు. చిన్నారులు పాఠశాలకు అలవాటయ్యేలా, పౌష్టికాహారం అందించి.. ఆటలు ఆడించి.. బడి అంటే భయం పోగొట్టేందుకే కేంద్రాలు అనుకునేవారు. అయితే ఈ విద్యాసంవత్సరం నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ మార్పులు తెచ్చారు. కేవలం పౌష్టికాహారం అందించడం.. ఆటపాటలతో గడపడమే కాకుండా.. వారికి విజ్ఞానాన్ని అందించేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, వర్క్‌బుక్‌లు అందించి.. వారితో హోంవర్క్ చేయించాలని నిర్ణయించారు. జిల్లాలో నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల కింద మొత్తం 926 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 816 మెయిన్ కేంద్రాలు కాగా.. 110 ఉప కేంద్రాలున్నాయి.


జిల్లా వివరాలు

ప్రాజెక్టులు	4
సెక్టార్లు	37
మొత్తం కేంద్రాలు	926
మెయిన్ కేంద్రాలు	816
మినీ కేంద్రాలు	110

బడిబాటలో చేపట్టే కార్యక్రమాలు

రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తారు. పౌష్టికాహారం, ఆటపాటలతో బోధన, పిల్లల మానసిక, శారీరక వృద్ధి, వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్య పరీక్షలు చేస్తారు. ఒకపూట సంపూర్ణ భోజనం, గుడ్డు అందిస్తారు. సామూహిక అక్షరాభ్యాసాలు చేయిస్తారు. ఎల్‌కేజీ పిల్లలకు తంగేడు పువ్వు, యూకేజీ పిల్లలకు పాలపిట్ట పుస్తకాలు ఉచితంగా అందిస్తారు.


అవగాహన కల్పిస్తున్నాం



వాడవాడన అంగన్‌వాడీ బడిబాట నిర్వహిస్తున్నాం. గ్రామ పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొనేలా చూస్తున్నాం. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పిస్తున్నాం. అంగన్‌వాడీల్లో ఐదేళ్లలోపు చిన్నారులను ఎందుకు చేర్చాలనే ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరిస్తున్నాం.

– విజయలక్ష్మి, జిల్లా సంక్షేమాధికారి

పిల్లల నమోదును పెంచుతాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల నమోదును పెంచడానికి జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. చిన్నారులను కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. పూర్వ ప్రాథమిక విద్యలో భాగంగా ప్రత్యేక బోధన చేపడతాం. అంగన్‌వాడీ బడిబాట విజయవంతానికి అంతా సహకరించాలి.

– నాగమణి, సీడీపీవో

'ఉపాధి' పథకం పేదలకు వరం



కూలీలతో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

సారంగాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకం నిరుపేదలకు వరంలా మారిందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఆలూరు, బోరిగాం, సారంగాపూర్ గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. కూలీల సమస్యలు, పని ప్రదేశంలో పడుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో చేపట్టే ప్రతీ పనిలో కూలీలకు భాగస్వామ్యం కల్పించడం హర్షణీయమన్నారు. ప్రతీ కుటుంబానికి 100 రోజులు పని కల్పించడంతో పాటు వారాంతంలో వేతనాలు ఖాతాల్లో జమ చేస్తున్నారని తెలిపారు. పని ప్రదేశాల్లో ఏదేని ప్రమాదం జరిగినా, మరే ఇతర సమస్యలు చోటు చేసుకున్నా బీమా వర్తించేలా కేంద్రం అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈయన వెంట నాయకులు విలాస్, సామల వీరయ్య, తిరుమలాచారి తదితరులున్నారు.

బీజేపీ ఎంపీని తక్షణమే అరెస్ట్ చేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పెంబి: లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్ట్ చేసి మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు గంగామణి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు వినోద, మమత, లక్ష్మి తదితరులున్నారు.

'బలగం' సుధాకర్‌రెడ్డికి సన్మానం



సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం పునఃప్రారంభం కాగా, బుధవారం ముఖ్య అతిథిగా 'బలగం' సినిమా ఫేమ్ కేతిరి సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఇతడిని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్ శాలువాతో సన్మానించారు. ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు గోపిడి గంగారెడ్డి, వార్డు సభ్యుడు సాయికృష్ణ, బర్కుంట గంగారాం తదితరులున్నారు.

క్లుప్తంగా

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లోని రాంజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్సియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ అందించేందుకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని డీడీ దిలీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులు ఇందుకు అర్హులని, అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.3లక్షలు మించరాదని, అభ్యర్థులు http//studycircle.cgg.in వెబ్‌సైట్‌లో లో ఈ నెల 9 నుండి జూలై 8 తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 6281766534 సంప్రదించాలని కోరారు.

సాయానికి కదులుతున్నారు...


ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

సాక్షి ఎఫెక్ట్

బోథ్: మండలంలోని గుర్రాలతాండ గ్రామంలో దీన పరిస్థితులోని మల్హారి సింగ్ కుటుంబంపై సాక్షిలో ఈ నెల 3వ తేదీన ×ఇంటికి పెద్ద దిక్కు.. ఆ చిన్నారి€ అనే కథనానికి స్పందన లభిస్తోంది. బుధవారం మదర్ డ్రీమ్స్ స్వచ్ఛంద సంస్థలో సాక్షిలో వచ్చిన కథనానికి బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం చేశారు. నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. గ్రామస్తులతో కుటుంబం పరిస్థితిపై చర్చించారు. కొంతమంది దాతలు ఫోన్‌పే ద్వారా నగదును అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు జీవన్‌రెడ్డి, సభ్యులు రాకేష్, సునీల్, అబ్దుల్, అల్మాస్ ఉన్నారు.

నిద్రమత్తులో భవనం పైనుంచి పడి ఒకరి మృతి

భైంసాటౌన్: నిద్రమత్తులో భవనం పైనుంచి కిందపడి ఒకరు మృతిచెందిన ఘటన భైంసాలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ ఎల్.శ్రీను వివరాల ప్రకారం.. మండలంలోని గుండెగాం గ్రామానికి చెందిన గిరి దత్తు(52) భార్య లక్ష్మీబాయితో కలిసి భైంసాలోని ఎస్‌బీ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే దత్తు మంగళవారం రాత్రి భార్యతో కలిసి మొదటి అంతస్తులో కాసేపు ఆరుబయట కూర్చున్నాడు. భార్యకు నిద్ర రావడంతో ఆమె ఇంట్లోకి వెళ్లి పడుకుంది. తెల్లవారి లేచేసరికి భర్త ఇంటి పక్కనే కింద పడి మృతి చెంది కనిపించడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. భార్య లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 27మందికి జరిమానా

ఖానాపూర్: ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఇటీవల కాలంలో 28మంది పట్టుబడ్డారు. దీంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు. దీంతో ఖానాపూర్ కోర్టు మెజిస్ట్రేట్ జితిన్ 27మందికి రూ.1000 చొప్పున జరిమానా విధించడంతో పాటు ఒకరికి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని హెచ్చరించారు.

మస్కాపూర్‌లో అగ్నిప్రమాదం


మంటలు ఆర్పివేస్తున్న స్థానికులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామంలోని అంబటి శ్రీనుకు చెందిన పశువుల పాకలో షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డివాముతో పాటు నూతన బైక్ పూర్తిగా దగ్ధమైంది. పశువుల పాకలో ఇంటి కోసం నిల్వ ఉంచిన 30 ధాన్యం బస్తాలు సైతం కాలిబూడిదయ్యాయి. దీంతో సుమారుగా రూ.3లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. స్థానికులతో పాటు ఫైర్ సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేయడంతో పెనుప్రమాదం తప్పింది. సకాలంలో మంటలు ఆర్పకుంటే సమీపంలోని నివాసాలకు సైతం మంటలు వ్యాపించేవి.






చేపల కోసం క్యూ..

మృగశిర కార్తె ఒక్కరోజు ముందే నిర్మల్ జిల్లా కేంద్రంలోని చేపల మార్కెట్లో విక్రయం జోరందుకుంది. మార్కెట్‌లో చేపలు కొనుగోలు చేసేందుకు బుధవారం జనం ఎగబడ్డారు. వివిధ రకాల చేపలతో పాటు ఒక్కొక్క చేప పది నుంచి 20కిలోల ఉండగా, మార్కెట్ కొనుగోలుదారులతో సందడి నెలకొంది. జిల్లాలో గొలుసుకట్టు చెరువులతో పాటు శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ ఉండడంతో మత్స్యకారులు వివిధ రకాల చేప పిల్లలను పట్టి మార్కెట్‌కు తీసుకొచ్చారు. బంగారు తీగలు, రొయ్యలు. రావట, మొట్ట పిల్లలతో మార్కెట్ కళకళలాడింది. బోయవాడ డిపో ముందు టెంట్లు వేసి చేపలను విక్రయించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఎస్టీ హోదా సాధించే వరకూ పోరాటం


మాట్లాడుతున్న మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే

తలమడుగు: ఎస్టీ హోదా సాధించే వరకూ పోరాటం చేయాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. తలమడుగు మండలం బరంపూర్‌లో బుధవారం మాలి పటేళ్ల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలి పటేళ్ల మాలీలను ఏకతాటిపైకి తేవాలని సంఘటితంగా ఉంటేనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాలీలకు ఎస్టీ హోదా విషయమై తీర్మాణం చేస్తాయని అన్నారు. 22ఏళ్ల పోరాటానికి అప్పుడే న్యాయం జరిగి ఎస్టీ హోదా లభిస్తుందని, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ముందుకెళ్లగలుగుతారన్నారు. ఈ నెల 9వ తేదీన తాంసి, తలమడుగు మండలాల రెవెన్యూ మండలాధికారులు, ఎస్సైలను కలిసి మాలీ సంఘ అధ్యక్షుడు సంతకాలతో కూడిన వినతి పత్రాలు అందించాలన్నారు. కుల ధృవీకరణ పత్రాలు, కళ్యాణలక్ష్మి లాంటి సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సంఘం పెద్దలు పెట్టిన సంతకాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. అలా కాకుండా వేరే వారు చేసిన సంతకాలను పరిగణలోకి తీసుకోకూడదని, కొంతమంది అధికారులు సంఘం అధ్యక్షుడి సంతకం లేకుండానే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే కలెక్టర్‌ని కలిసి విన్నవిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న సేండే కుచులాపూర్ మహాజన్ విలాస్ సెండే, బరంపూర్ మహాజన్ వినోద్ గుర్నులే, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అంబేకర్ చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట్రంగే అనిల్, ఉత్తం మాందాడే, రమేష్ గురునూలే పాల్గొన్నారు.

గొర్రెల కోసం ఏపీలో యాదవుల గోస


మాచర్లలో నిర్మల్ జిల్లా గొర్రెల లబ్ధిదారులు

ఖానాపూర్: జిల్లాలోని సారంగపూర్, ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన యాదవులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ గొర్రెల యూనిట్ల కోసం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి నాలుగు రోజులుగా అక్కడే పడిగాపులు కాస్తున్నారు. సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు ముందుగా గుంటూరుకు వెళ్లారు. ఆ తర్వాత అధికారుల సూచన మేరకు కడపతో పాటు పల్నాడు జిల్లా మాచర్లకూ వెళ్లారు. అధికారులు పట్టించుకోకపోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. దారి ఖర్చుల కోసం తెచ్చుకున్న డబ్బులు కూడా అయిపోగా ఎండలో రోడ్లపై ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం లాడ్జిల్లో ఉంటూ తమను పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

వేర్వేరు కారణాలతో..
నలుగురు యువకుల మృతి

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో బుధవారం నలుగురు యువకులు వేర్వేరు కారణాలతో మృతిచెందారు. లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన యువకుడు గల్ఫ్ వెళ్లి అనారోగ్యంతో మృత్యువాతపడగా ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. అలాగే ఆదిలాబాద్‌రూరల్ మండలంలో ఓ యువకుడు పాముకాటుకు గురై మృతిచెందగా, ఇచ్చోడ మండలంలో బైక్‌పై నుంచి పడి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఇంద్రవెల్లి మండలంలో వడదెబ్బ తగలడంతో ఆస్పత్రికి తరలించే క్రమంలో మరో యువకుడు విగతజీవిగా మారాడు. ఈ సంఘటనలతో ఆయా గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

దుబాయ్‌లో లక్ష్మణచాంద వాసి..

లక్ష్మణచాంద: బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లిన యువకుడు అనారోగ్యంతో మృతిచెందిన విషాద ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ పడతం శ్రీనివాస్ (23) కొద్ది నెలల క్రితం దుబాయ్ వెళ్లాడు. అనారోగ్యంతో బుధవారం రూములోనే మృతిచెందాడు. శ్రీనివాస్ మృతి చెందిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తన రూములోని మిత్రులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో శ్రీనివాస్ కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

పాముకాటుతో యువకుడు..

ఆదిలాబాద్‌రూరల్: పాముకాటుతో మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన గోకుల ఆనంద్ రావ్ మంగళవారం మృతి చెందినట్లు ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గోవింద్ రావ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పొచ్చర గ్రామానికి చెందిన ఆనంద్ రావ్(33) గ్రామంలోని బస్టాండ్ సమీపంలో కిరాణ షాపును కొనసాగిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇదే క్రమంలో మంగళవారం పాము షాపులోకి చొరబడి కాలు కాటువేయడంతో స్థానికులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందాడు. ఆనంద్‌రావుకు ఏడాది క్రితమే వివాహం కాగా మూడు నెలల కూతురు, భార్య శిరీష ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో..

ఇచ్చోడ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని ముఖరా(బి) గ్రామానికి చెందిన బాలే శ్రీనివాస్(17) బైక్‌తో వేగంగా వెళ్లడంతో డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో..


ఆడ వినోద్ (ఫైల్)

ఇంద్రవెల్లి: వడదెబ్బతో యువకుడు మృతిచెందిన సంఘటన బుధవారం మండలంలోని దుబ్బగూడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... మండలంలోని దుబ్బగూడ గ్రామానికి చెందిన ఆడ హనుమంత్ రావ్, రాధాబాయి దంపతుల పెద్ద కుమారుడు ఆడ దినేశ్ (19) మంగళవారం ఎండలో తిరిగాడు. బుధవారం తెల్లవారు జమునా వాంతులు, విరేచనలు కావడంతో కుటుంబీకులు వెంటనే మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ దగ్గరకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అయినా ఫలితం లేకపోవడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించేందుకు సిద్ధం అవుతుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి


పరీక్షిస్తున్న అదనపు వైద్యాధికారి కుమురం బాలు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుమురం బాలు అన్నారు. బుధవారం గాదిగూడ మండలంలోని పిప్రి గ్రామ పంచాయతీ పరిధిలోని గొండుగూడ, కొలాంగూడ, అంద్‌గూడ గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. మూడు గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలను ఆయన తనిఖీ చేశారు. గిరిజనులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులతో పాటు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామ స్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని అన్నారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించాలని సూచించారు. బుధవారం మూడు గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో మొత్తం 130 మంది రోగులు, ఏడుగురు గర్భిణులను పరీక్షించినట్లు తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైనా వైద్యం అందించాలని సూచించారు. రోగులపై నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. దంతన్‌పల్లి ఎంసీహెచ్ టీం డాక్టర్ అంకిత్‌రెడ్డి, ఇంద్రవెల్లి ఎంసీహెచ్ టీం డాక్టర్ కార్తీక్, సురేశ్, శిరీష్ అడిషనల్ డీఎంహెచ్‌వో సిబ్బంది, హెచ్‌ఈవో రాథోడ్ తులసిదాస్, ఝరి పీహెచ్‌సీ వైద్యాధికారి సంజీవ్ పాల్గొన్నారు.

నిండా ముంచిన వైన్ యాప్!

- పేట్రేగిపోతున్న ఆన్‌లైన్ మోసాలు
- యాప్‌ల పేరిట బురిడీ కొట్టిస్తున్న మోసగాళ్లు



చెన్నూర్: సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త యాప్‌లతో లాభాల ఆశలు చూపి కోట్లు కొల్లగొడుతున్నారు. వైన్‌యాప్ పేరుతో చెన్నూర్ మండలానికి చెందిన అమాయకులను టార్గెట్ చేసి మోసాలకు పాల్పడుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొంతమంది వైన్ వ్యాపారం పేరుతో యాప్ ఏర్పాటు చేశారు. వచ్చిన ఆదాయాన్ని పెట్టుబడిదారులకు రెట్టింపు లాభాలను పంపిస్తామని ఆశ చూపారు. కొత్తలో పెట్టిన పెట్టుబడికి లాభాలను పంపించి నమ్మించారు. దీంతో చైన్ సిస్టమ్ ద్వారా లక్షలాది మంది యాప్‌లో చేరారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని ఆశపడ్డ ప్రభుత్వ, ప్రైవేట్, సింగరేణి ఉద్యోగులతో పాటు చిరువ్యాపారులు లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. బిచానా ఎత్తేయడంతో లబోదిబో మంటున్నారు. జిల్లాలోని చెన్నూర్, కోటపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి, సింగరేణి ప్రాంతానికి చెందిన వారు పెద్ద ఎత్తున ఉన్నట్లు తెలిసింది.

లాభాల ఆశతో...

చెన్నూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన నరిశెట్టి రాకేశ్ గత నెల 18న వైన్ యాప్‌లో చేరి రూ.37,500 పెట్టుబడి పెట్టాడు. 19 నుంచి రోజుకు 2,268 చొప్పున పది రోజుల పాటు రూ.22,680 వచ్చాయి. దీంతో అతని ఆశకు అంతులేకుండా పోయింది. తన భార్య పేరిట మరో రూ.55వేలు పెట్టాడు. పది రోజుల పాటు లాభాలను పంపించిన నిర్వాహకులు గత నెల 30 నుంచి ఆపేశారు. యాప్‌లో డబ్బులు ఫెయిల్ అని కన్పించడం ప్రారంభించింది. మోసపోయానని గుర్తించాడు. జిల్లాలో రాకేశ్ లాంటి వారు వేలాది మంది ఉన్నారు.

నాలా ఎవరూ మోసపోకండి



చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. ఈజీమనీకి ఆశపడి మోసపోయా. సైబర్ నేరగాళ్లు అమాయకులకు డబ్బు ఆశచూపి దండుకుంటున్నారు. నాలా చాలామంది మోసపోయారు. ఎవరూ బయటికి రావడంలేదు. మరికొంత మంది మోసపోవద్దని ముందుకు వచ్చా.

– నరిశెట్టి రాకేశ్, గంగారం, చెన్నూర్

అత్యాశకు పోవద్దు



సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. డబ్బులు ఎక్కువగా ఇస్తామంటే అత్యాశకు వెళ్లి మోసపోవద్దు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. ఇప్పటి వరకు వైన్ యాప్ బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. పోలీసులను సంప్రదిస్తే పరిశీలిస్తాం.

– వాసుదేవరావు, సీఐ చెన్నూర్

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

- నాలుగు దుకాణాలపై కేసులు


తనిఖీ నిర్వహిస్తున్న అధికారి జలీల్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో బుధవారం తునికల కొలతల శాఖ జిల్లా అధికారి ఎం.ఏ జలీల్ ఆకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించారు. నేహ ఏజెన్సీ, సాయి నాథ్ అగ్రో ఏజెన్సీ, హరిహోం అగ్రో ఏజెన్సీ దుకాణ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కొన్ని పత్తి రకాల విత్తనాలపై తయారు చేసిన కంపెనీ పేరు లేకపోవడం, కొన్ని రకాల విత్తనాలపై యూనిట్ సెల్, ధర, బరువు ఎంత కనిపించకపోవడంతో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విత్తనాల ప్యాకెట్లపై ధర, బరువు, తయారు చేసే కంపెనీ పేరు తప్పనిసరిగా ఉండాలని, జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పెంపుడు జంతువును చంపిన వారిపై కేసు నమోదు

లక్ష్మణచాంద: పెంపుడు జంతువును చంపిన మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ఎంజలి ఆనంద్‌కు పెంపుడు కుక్కను పొట్టపెల్లి (కె) గ్రామానికి చెందిన శ్రీనివాస్, చామన్‌పెల్లి గ్రామానికి చెందిన వరుణ్ అనే ఇద్దరు వ్యక్తులు అపహరించారు. దీంతో ఆనంద్ బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన పెంపుడు జంతువును చంపి జింక మాంసం పేరుతో విక్రయించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఎదులాపురం: రెజ్లర్లపై వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ మహిళా కుస్తీ యోధులపై బీజేపీ పార్లమెంటు సభ్యులు, రెజ్లర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్‌ను వెంటనే అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని, చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. భారత కీర్తి పతాకాన్ని ఎగురవేసి పతకాలు సాధించిన రెజ్లర్లు దేశ రాజధానిలో గత కొన్ని రోజులుగా పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఎంపీపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెర్క దేవిదాస్, అరుణ్, లక్ష్మి, అనిల్, అనురాధ, అనిత, సునీత, మణెమ్మ, రాజమణి, ప్రేమకల, సంగీత, విజయ ఉన్నారు.